దేవాలయానికి ఎమ్మెల్యే భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

నాగోలు: డివిజన్ పరిధి బండ్లగూడలో నూతనంగా నిర్మించే వేంకటేశ్వర రామాలయ భూమిపూజ జరిగింది. సోమవారం జరిగిన ఈ పూజా కార్యక్రమంలో ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. సీనియర్ కాంగ్రెస్ నేతలు, టీపీసీసీ సభ్యులు దేప భాస్కర్‌రెడ్డి, టూరిజం పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తాలు పూజలు నిర్వహించారు. దేవాలయ చైర్మన్ చెర్కు జంగయ్యగౌడ్, వైస్ చైర్మన్ తూర్పాటి సుదర్శన్, ప్రధాన కార్యదర్శి సుర్వీ రాజుగౌడ్, సహాయ కార్యదర్శి రాజుగౌడ్, ఆర్గనైజర్ సెక్రటరీ సహదేవ్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాగోలు డివిజన్ అధ్యక్షుడు తూర్పాటి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ధన్వంతరి విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు



విగ్రహ ప్రతిష్టాపనకు సిద్ధమైన మండపం

మన్సూరాబాద్: హయత్‌నగర్ పరిధి వినాయక్‌నగర్‌కాలనీలోని వివేకానంద మెడికల్ సెంటర్‌లో భారతీయ సంస్థ ఆధ్వర్యంలో ధన్వంతరి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాలు సోమవారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. యాజ్ఞిక బ్రహ్మ తిరుప్పావై కేసరీ డాక్టర్ పీటీజీఎస్ కిషోర్‌స్వామి పర్యవేక్షణలో సోమవారం నుంచి గురువారం వరకు నాల్గు రోజుల పాటు ప్రతిష్టాపనోత్సవాలు జరుగుతాయని నిర్వహకులు డాక్టర్ గొల్లూరి రమేష్‌సాగర్ ప్రకటించారు.

కర్మన్‌ఘాట్‌లో ఈటల ప్రత్యేక పూజలు



చంపాపేట: చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామి వారిని సోమవారం రాత్రి మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనను వేద మంత్రాలతో ఆశీర్వదించి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. స్థానిక డివిజన్ కార్పొరేటర్, బీజేపీ నేతలు వంగ మధుసూదన్‌రెడ్డి, పాశం శ్రీశైలం, సిల్వేరు అనిల్‌కుమార్ తదితరులున్నారు.

ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో ఏజీఎం సతీష్, ప్రిన్సిపల్ భువనేశ్వరి

మలక్‌పేట: పాఠశాల స్థాయి ఒలింపియాడ్ పరీక్షల్లో విద్యార్థులు ప్రావీణ్యం సంపాదిస్తే భవిష్యత్తులో మరింతగా రాణిస్తారని శ్రీ చైతన్య స్కూల్ దిల్‌సుఖ్‌నగర్ ఏజీఎం సతీష్ అన్నారు. మూసారంబాగ్ ఎస్‌బీఐ ఆఫీసర్స్ కాలనీ స్కూల్లో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలంపియాడ్ (ఐఎన్‌టీఎస్‌ఓ)–2 రౌండ్‌లో ప్రతిభ చాటిన విద్యార్థులను ఘనంగా సన్మానించి సర్టిఫికెట్లు, మెడల్స్‌ను అందజేశారు. ప్రిన్సిపాల్ భువనేశ్వరి, ఆర్‌ఐ వెంకట్‌రెడ్డి, కో– ఆర్డినేటర్ రఘు వంశీ, డీన్ గిరి, ప్రైమరీ ఇన్‌చార్జి వరలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'యువత బీజేపీ వైపే మొగ్గు'



భరత్‌కుమార్‌ను సన్మానిస్తున్న నాయకులు

మలక్‌పేట: యువత బీజేపీ వైపే మొగ్గు చూపుతుందని భాగ్యనగర్ జిల్లా బీజేవైఎం అధ్యక్షుడు అనుముల భరత్‌కుమార్ అన్నారు. మూసారంబాగ్ డివిజన్‌కు చెందిన బీజేపీ, బీజేవైఎం నాయకులు సోమవారం బ్యాండ్ బస్తీలోని నివాసంలో ఆయనను కలిసి బీజేవైఎం జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన సందర్భంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. అందరి సహకారంతో బీజేవైఎంను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. పార్టీ పిలుపు మేరకు కార్యక్రమాలను విజయవంతం చేసేలా ముందుకు సాగుతామని స్పష్టం చేశారు. నాయకులు గౌర దేవేందర్, సదానంద్, చందు, రంజిత్, గణేష్, ఉదయ్, అనిల్, గాయత్రి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి, మహిళా మండలి ప్రతినిధులు

వనస్థలిపురం: మహిళా మండలి ఆధ్వర్యంలో దశాబ్దకాలానికి పైగా ప్రతి ఎండాకాలంలో చలివేంద్రం ఏర్పాటు చేస్తూ.. బాటసారుల దాహార్తిని తీర్చడం అభినందనీయమని వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. జనప్రియ హోమ్స్ కాలనీకి చెందిన శ్రీ వైష్ణవి జనప్రియ మహిళా మండలి ఆధ్వర్యంలో చింతలకుంట ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. మాజీ కౌన్సిలర్ ఈశ్వరమ్మయాదవ్, నాయకులు వేములయ్యగౌడ్, భావన శ్రీనివాస్, మహిళా మండలి అధ్యక్షురాలు జ్యోతిసాయి, ప్రతినిధులు భాగ్యలక్ష్మి, పద్మ, శశికళ తదితరులున్నారు.

పైసా వసూల్ !

- టాప్‌లో ఎల్‌బీనగర్ సర్కిల్–3
- టార్గెట్‌కు చేరువగా ఆస్తిపన్ను వసూళ్లు
- లక్ష్యం రూ.320.93 కోట్లు
- వసూళ్లు రూ.281.29 కోట్లు



జోనల్ కమిషనర్ కార్యాలయం

ఎల్‌బీనగర్: గ్రేటర్ పరిధిలోనే 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఎల్‌బీనగర్ జోనల్ ఆస్తిపన్ను వసూళ్లలో ఎల్‌బీనగర్ సర్కిల్–3 టాప్‌గా నిలిచింది. జోనల్ పరిధిలోని ఐదు సర్కిళ్లలో ఆస్తిపన్ను వసూళ్ల లక్ష్యం రూ. 320.93 కోట్లు కాగా.. వచ్చిన ఆదాయం రూ. 281.29 కోట్లు. జోనల్ పరిధి వసూళ్లలో 87.65 శాతం ఉందని అధికారులు చెబుతున్నారు. గతేడాదిలోనూ ప్రథమ స్థానంలో ఉన్నామని తెలిపారు. ఐదు సర్కిళ్ల పరిధిలోని డీసీలు, రెవెన్యూ సిబ్బంది చేసిన కృషి ఫలితమేనని జోనల్ కమిషనర్ ముకుందరెడ్డి పేర్కొన్నారు.

సర్కిళ్ల వారీగా వసూళ్ల వివరాలిలా..

- కాప్రా సర్కిల్ లక్ష్యం రూ. 65.63 కోట్లు, వసూలైంది. రూ. 58.61 కోట్లు వసూళ్ల శాతాన్ని పరిశీలిస్తే 89.30 శాతం జోనల్‌లో రెండో స్థానంలో ఉంది.
- ఉప్పల్ సర్కిల్ లక్ష్యం రూ. 43.10కోట్లు, కాగా వసూలైంది రూ. రూ. 36.91కోట్లు. వసూళ్ల శాతంలో 85.64 శాతంలో ఉంది. జోనల్ పరిధిలో ఆస్తిపన్ను వసూళ్లలో మూడో స్థానంలో ఉంది.
- హయత్‌నగర్ సర్కిల్‌లో ఆస్తిపన్ను వసూళ్ల లక్ష్యం రూ. 74.01 కోట్లు కాగా.. రూ. 74.46 కోట్లు వసూలైంది. 100.61 శాతంతో మొదటి స్థానంలో ఉంది.
- ఎల్‌బీనగర్ సర్కిల్–4లో వసూళ్ల లక్ష్యం రూ. 62.56కోట్లు, వచ్చింది రూ. 50.60 కోట్లు, వసూళ్లలో 80.88 శాతంతో జోనల్ పరిధిలో నాలుగో స్థానంలో ఉంది.
- ఎల్‌బీనగర్ సర్కిల్–5 వసూళ్ల లక్ష్యం రూ.75.63 కోట్లు కాగా.. వసూలైంది రూ. 60.71 కోట్లు, వసూళ్లలో మాత్రం 80.27 శాతంతో జోనల్ పరిధిలో ఐదో స్థానంలో ఉంది.

ఎర్లీబర్డ్ కింద 5 శాతం రాయితీ..

ఎర్లీబర్డ్ కింద ఏప్రిల్ నెలలో ఆస్తిపన్నులు చెల్లిస్తే పన్నుల్లో రాయితీలు ఉంటాయని ఇంటి యజమానులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని జోనల్ కమిషనర్ ముకుందరెడ్డి తెలిపారు. ఏప్రిల్‌లో చెల్లిస్తేనే ఈ రాయితీ వర్తిస్తుందని స్పష్టం చేశారు.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి..

చాదర్‌ఘాట్: ఇంటి పన్ను చెల్లింపుదారులు ఎర్లీబర్డ్ స్కీమ్‌ను సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్‌ఎంసీ మలక్‌పేట సర్కిల్–6 డీసీ జయంత్ సూచించారు. సోమవారం మలక్‌పేట్‌లోని ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ.. ఏప్రిల్ 30లోగా 2024–25 సంవత్సరానికి ప్రాపర్టీ ట్యాక్స్ కట్టి ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. పాత బకాయిలు కూడా చెల్లించవచ్చని ఆయన తెలిపారు. చెల్లింపులు జీహెచ్‌ఎంసీ సిటిజెన్ సర్వీస్ సెంటర్లు, మీ సేవా కేంద్రాలు, బిల్ కలెక్టర్ల వద్ద గానీ, ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చని ఆయన తెలిపారు.

దరఖాస్తుల స్వీకరణకు బ్రేక్

ఆవేదన వ్యక్తం చేస్తున్న గృహజ్యోతి దరఖాస్తుదారులు



జీహెచ్‌ఎంసీ సర్కిల్–6 కార్యాలయంలో దరఖాస్తులు పరిశీలిస్తున్న డీసీ జయంత్

చాదర్‌ఘాట్: మలక్‌పేట నియోజకవర్గ పరిధిలోకి వచ్చే అజంపురా, ఓల్డ్ మలక్‌పేట, సైదాబాద్, అక్బర్‌బాగ్, చావుని, మూసారాంబాగ్ డివిజన్లలోని వివిధ కారణాలతో వేలాది మంది అర్హులకు గృహజ్యోతి పథకం వర్తించకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

- ఈ నియోజకవర్గంలో తెల్ల రేషన్‌కార్డులు 70 వేల మంది ఉన్నారు. ఇందులో దాదాపు అందరూ 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగిస్తున్నారు.
- వీరంతా ప్రజాపాలన కేంద్రాల్లో గృహజ్యోతి పథకం కోసం దరఖాస్తులు చేసుకున్నారు.
- విద్యుత్ లైన్‌మెన్‌లు ఇంటింటి సర్వే చేపట్టి 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగం చేస్తున్న వారిని ఇంకో 30 వేల మందిని గుర్తించారు.
- విద్యుత్ సిబ్బంది తేల్చిన వారిని పక్కన పెట్టి, ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారికి మాత్రమే అన్నీ సక్రమంగా ఉంటే ఈ పథకానికి వర్తింపజేయడంతో వేలాది మంది అర్హులు లబోదిబోమంటున్నారు.
- గతంలో దరఖాస్తు చేసుకున్న వారిలో కూడా కొంతమంది ఆధార్ కార్డు నెంబర్ సరిగ్గా లేకపోవడం, గృహజ్యోతి పథకానికి అని రాయక పోవడంతో వీరికి లబ్ధి చేకూరలేదు.
- ఈనెల లోపు సుమారు 18 వేల మంది అర్హులు ఉచిత విద్యుత్ కోసం దరఖస్తులు చేసుకున్నారు. తీరా లబ్ధి చేకూరుతుందనుకున్న సమయంలో కోడ్ కూసింది.

కోడ్‌తో నిలిచిన ప్రక్రియ..

ఉచిత విద్యుత్ పథకానికి అర్హులైన వారు ప్రజాపాలన సేవా కేంద్రాల్లో నెంబర్లు సరిగ్గా వేసి మళ్లీ దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి 200 యూనిట్లు లోపు వాడుకుంటే బిల్లులు మాఫీ చేయనున్నట్లు ఇటీవల అధికారులు పరిశీలించారు. దరఖాస్తు చేసుకున్న సమయంలోనే కోడ్ అమలులోకి రావడంతో ఈ ప్రక్రియ నిలిచిపోయింది. ఎన్నికల కోడ్ జూన్ 6 వరకు అమల్లో ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఈ లోపు బిల్లులు చెల్లించాలా.. లేదా అని వినియోగదారులు సందిగ్ధంలో పడిపోయారు.

'స్కాములు లేని దేశంగా భారత్'



ఈటల ఎన్నికల ప్రచారానికి హాజరైన బీజేపీ శ్రేణులు

బీజేపీ మల్కాజిగిరి అభ్యర్థి ఈటల రాజేందర్

హస్తినాపురం: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అన్ని స్కాములేనని, స్కాములు లేని దేశంగా భారత్‌ను ప్రధాని నరేంద్ర మోదీ నిలిపాడని బీజేపీ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్ నియోజవర్గం హస్తినాపురం డివిజన్‌లోని తెలంగాణ చౌరస్తా నుంచి శ్రీరమణ వై జంక్షన్ వరకు సోమవారం రాత్రి భారీ పాదయాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీ మాట్లాడే నాయకుడే కాకుండా పనిచేసే నాయకుడని, ఆయన పనితనమే నాకు స్ఫూర్తి నింపుతుందన్నారు. దేశ ప్రజలందరూ మా బిడ్డలే అని నమ్మి పని చేస్తున్న నాయకుడు మోదీ అని పేర్కొన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించారని, ముస్లిం మహిళల రక్షణకు త్రిపుల్ తలాక్ చట్టాన్ని తీసుకొచ్చారని స్పష్టం చేశారు. దేశంలోని పేద ప్రజలందరికీ ఉచితంగా బియ్యాన్ని ప్రధాని మోదీ అందిస్తున్నారన్నారు. ' తెలంగాణ ఉద్యమ బిడ్డగా నేను ఏవిధంగా పనిచేశానో మీరందరికి తెలుసునని, ఈ ఎన్నికల్లో నన్ను ఆశీర్వదించాలని' కోరారు. నాయకులు గోలి మధుసూదన్‌రెడ్డి, ఆర్.కే. శ్రీనివాస్, పాతూరి కరుణ, కార్పొరేటర్లు మొద్దు లచ్చిరెడ్డి, కొప్పుల నర్సింహ్మారెడ్డి, రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, రంగ నర్సింహ్మాగుప్తా, కళ్లెం నవజీవన్‌రెడ్డి, పవన్‌కుమార్, వంగ మధుసూదన్‌రెడ్డి, చింతల సురేందర్‌యాదవ్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న జిజ్ఞాస - 2024



డీఆర్‌డీఓ ఏఎస్‌ఎల్ ప్రాజెక్టు డైరెక్టర్‌కు జ్ఞాపికను అందజేసిన కళాశాల సెక్రటరీ

సైదాబాద్: వినూత్న సాంకేతిక ఆవిష్కరణలకు జిజ్ఞాస వంటి సాంకేతిక ఉత్సవాలు దోహదం చేస్తాయని డీఆర్‌డీఓ ఏఎస్‌ఎల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎస్.శంకరి అన్నారు. సోమవారం ఐఎస్‌సదన్ డివిజన్ వినయ్‌నగర్ కాలనీలోని భోజిరెడ్డి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో జిజ్ఞాస–2024 పేరుతో జాతీయ స్థాయి సాంకేతిక ఉత్సవాన్ని ఆమె ప్రారంభించారు. రెండ్రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవంలో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, గుజరాత్, భూపాల్ సహా పలు రాష్ట్రాల నుంచి 1073 మంది ఔత్సాహిక విద్యార్థులు అత్యాధునిక ప్రాజెక్టులతో పాల్గొంటున్నారని ప్రోగ్రామ్ కన్వీనర్ ఆర్. మంజు భార్గవి తెలిపారు. జిజ్ఞాస ఉత్సవం మొదటిరోజు ఇన్నోటాక్స్ వంటి ఈవెంట్లతో సందడిగా సాగింది. విద్యార్థులు మైండ్ మేజ్ వంటి చాలెంజ్ టెస్టింగ్ ప్రాబ్లమ్స్, సాల్వింగ్ సామర్థ్యం సహా పోస్టర్ ప్రదర్శన, పేపర్ ప్రదర్శనలతో, చక్కటి వివరణలతో తమ సామర్థ్యంతో ఆకట్టుకున్నారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఎస్.శంకరి మాట్లాడుతూ.. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఇలాంటి ఉత్సవాలు తోడ్పడుతాయన్నారు. సాంకేతిక భవిష్యత్తును రూపొందించడంలో జిజ్ఞాస ఉత్సవాలు సాధనంగా ఉంటాయన్నారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ ప్రొఫెసర్ వి.సుధ ఆమెకు శాలువా కప్పి జ్ఞాపికతో సత్కరించారు. సీఓఓ డాక్టర్ సుజాత గంగాధర్, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ గ్రేసీ శైలజ, మాధవన్, దయాకర్‌రెడ్డి, కన్వీనర్ మంజు భార్గవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రతి విజయం ఇతరులకు ఆదర్శం కావాలి



విజేతలతో ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

నాగోలు: క్రీడాకారులు సాధించిన ప్రతి విజయం ఇతరులకు ఆదర్శం కావాలని టూరిజం పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. సోమవారం నాగోలు, బండ్లగూడ సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డు ఆవరణలో ఖేలో ఇండియా ఉమెన్స్ సైక్లింగ్ లీగ్ (సౌత్ జోన్ హైదరాబాద్) విజేతలకు బహుమతుల ప్రదానోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కర్ణాటక, కేరళ తమిళనాడు నుంచి క్రీడాకారులు 75 మంది పాల్గొన్నారు. ఈ పోటీల్లో అండర్–16, అండర్–18, అండర్–18+ జూనియర్స్ అండ్ సీనియర్స్ ఉమెన్స్ క్రీడాకారులున్నారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ.. శారీరక శ్రమతో కూడిన క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయన్నారు. ఈ క్రీడలు క్రీడాకారులకు ఆనందం, ఆరోగ్యంతో పాటు అందరికీ స్ఫూర్తిదాయకంగా ఉంటుందన్నారు. ఇలాంటి ఆరోగ్యవంతమైన సమాజమే లక్ష్యంగా ఉన్నత ఆశయంతో అంకితభావంతో ప్రతి ఒక్కరూ పనిచేయాలని, క్రీడాకారులను ప్రోత్సహించాలని వివరించారు. కో– ఆర్డినేటర్ డా. మాక్స్‌వెల్ ట్రావెర్, రీజనల్ డైరెక్టర్ జి.కృష్ణమూర్తి, కమిషనర్ ఆర్.జయకుమార్, ఓబులేష్, నార్మన్ ఇస్సాక్, నితీష్, అనిల్, గౌతమ్, బీఆర్‌రెడ్డి, సుశీల్‌రావు, ఎస్‌కే పాషా, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కలిస్తే.. గెలుస్తాం !

చంచల్‌గూడ: లోకసభ ఎన్నికల్లో హైదరాబాద్ పార్లమెంట్ స్థానాన్ని గెలవడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని బీజేపీ హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి డా. మాధవిలత అన్నారు. సోమవారం ఆమె కుర్మగూడ డివిజన్‌లో పర్యటించి వివిధ బాధ్యతలు నిర్వర్తిస్తున్న డివిజన్ నాయకులను స్వయంగా ఇంటికి వెళ్లి కలిశారు. తన అభ్యర్థిత్వాన్ని బలపరిచి భాగ్యనగరాన్ని గెలిచి ప్రధాని మోదీకి బహుమతిగా ఇద్దామని పిలుపునిచ్చారు. హైదరాబాద్ రాష్ట్రానికి రాజధాని కావడం వల్లే కొత్త నగరం మినహా పాతబస్తీలో ఒక్క నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోలేదని, కులమతాలకు అతీతంగా ప్రజలు ఒక్కసారి బీజేపీకి అవకాశం ఇచ్చి చూడాలన్నారు. డివిజన్ అధ్యక్షుడు బండ వెంకట్‌రెడ్డి, వివిధ మోర్చా నాయకులు లలిత, ధర్మతేజ, మోహన్‌కృష్ణ, ప్రదీప్, గౌతమ్, ప్రేమ్, యుగేంధర్, వరుణ్ తదితరులున్నారు.



డివిజన్ నాయకులతో బీజేపీ హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి మాధవిలత

వ్యసనాలకు దూరంగా ఉండాలి

యాంటీ హ్యూమన్ ట్రాఫింగ్‌పై అవగాహన

మీర్‌పేట: రాచకొండ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో సోమవారం మీర్‌పేట కార్పొరేషన్ పరిధి గాయత్రినగర్‌లోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో యాంటీ హ్యూమన్ ట్రాఫింగ్ యూనిట్ అవేర్‌నెస్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ చంద్రబాబు, ఎస్‌ఐలు కరుణాకర్‌రెడ్డి, సాంబయ్యలు మాట్లాడారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, ముఖ్యంగా సోషల్ మీడియాలో అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎవరికీ కూడా వ్యక్తిగత సమాచారాన్ని ఇవ్వొదని సూచించారు. అనంతరం మానవ అక్రమ రవాణా, లైంగిక దోపిడీ, ఈవ్‌టీజింగ్, సైబర్ మోసాలు, బాల్య వివాహాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయని పాఠశాల కరస్పాండెంట్ జార్జిపాల్ పేర్కొన్నారు.

బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

ప్రమాణస్వీకారం చేసిన అధ్యక్ష, కార్యదర్శులు

రంగారెడ్డి కోర్టులు: జిల్లా కోర్టులో న్యాయవాద సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. గత శుక్రవారం పోలింగ్ ద్వారా ఎన్నికైన సంఘం అధ్యక్షుడు కొండల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు పాము రాజేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గులగారి కృష్ణ, సంయుక్త కార్యదర్శి బొమ్మరాజు రాదాకృష్ణ, కోశాధికారి కెరిత్ కుమారి, లైబ్రేరియన్ గొబ్బూర్ రాములు, క్రీడా, సాంస్కృతిక కార్యదర్శి అశోక్ అందేకర్, మహిళా ప్రతినిధి మీనాక్షి, కార్యవర్గ సభ్యులు ప్రవీణ్‌కుమార్‌గౌడ్, రవి, సందీప్, శైలజ, స్వప్న కొండ్ర, వంశీకృష్ణ, విజయ్‌చంద్రకిరణ్‌లు సోమవారం ఎన్నికల అధికారులు గుర్రమ్ సుధాకర్‌రెడ్డి, వరద లక్ష్మణ్ సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు.

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజార్‌లో కూరగాయల ధరలు (కిలో. రూల్లో)... టమాటా రూ.17, వంకాయ 18, బెండకాయ 35, పచ్చిమిర్చి 55, కాకర 35, బీరకాయ 35, క్యాబేజి 19, ఫ్రెంచ్‌బీన్స్ 45, క్యారెట్ 23, దొండకాయ 19–23, చిక్కుడు 28–50, గోకర 23, బీట్‌రూట్ 19, క్యాప్సికమ్ రూ.65, ఆలుగడ్డ రూ.31, దోసకాయ 16, సొరకాయ రూ.9, పొట్లకాయ 18, ఉల్లిగడ్డ 20, చామగడ్డ 40 గా ఉన్నాయి.

వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



స్వామివారి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న భక్తులు

మన్సూరాబాద్: విజయశ్రీ కాలనీలోని పద్మావతి గోదా సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయ వార్షికోత్సవంలో భాగంగా బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. సోమవారం ఉదయం 9.30 గంటలకు ఉత్సవారంభ స్వపనం, సాయంత్రం 6 గంటలకు అంకురార్పణ, విశ్వక్సేనా పూజా, రక్షాబంధనం, శేషవాహన సేవ కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ చీర్క నర్సిరెడ్డి, పోరెడ్డి రమణారెడ్డి, ఏనుగు చంద్రారెడ్డి, యానాల కొండల్‌రెడ్డి, ఎద్దుల శ్యామ్‌సుందర్‌రెడ్డి, కమటాల కిరణ్‌కుమార్, మర్రి కిషన్‌రెడ్డి, నరేందర్‌గౌడ్, వారాల మోహన్‌రెడ్డి, భీమిడి నర్సింహ్మారెడ్డి, బొడిగే లోకేశ్వర్‌గౌడ్, పానుగోటి కొండల్‌రావు, దూస సత్యనారాయణ తదితరులున్నారు.

కాంగ్రెస్‌లోకి జహంగీర్ బాబుగౌడ్



మల్‌రెడ్డి రాంరెడ్డితో జహంగీర్ బాబు

చైతన్యపురి: ఎల్‌బీనగర్ నియోజకవర్గానికి చెందిన జహంగీర్ బాబుగౌడ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మల్‌రెడ్డి రాంరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలంగా పని చేశానని కొన్ని కారణాల వల్ల ఇతర పార్టీలో చేరానన్నారు. తిరిగి సొంత గూటికి చేరటం తనకు సంతోషాన్ని కలిగించిందని అభిప్రాయపడ్డారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. పన్యాల జైపాల్‌రెడ్డి తదితరులున్నారు.

అలంకారప్రాయంగా వాటర్ ఏటీఎంలు



సరస్వతీనగర్ రహదారిపై నిరుపయోగంగా ఇలా..

సైదాబాద్: వేసవిలో పాదచారుల దాహార్తిని తీర్చేందుకు జీహెచ్‌ఎంసీ ఏర్పాటు చేసిన వాటర్ ఏటీఎంలు రహదారులపై అలంకార ప్రాయంగా మారాయి. ప్రజల సొమ్ముతో రూ. లక్షలు ఖర్చుచేసి రహదారులపై ఏర్పాటు చేసిన వాటర్ ఏటీఎంలు నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో నిరుపయోగంగా మిగిలిపోతున్నాయి. ప్రారంభంలో వాటర్ ఏటీఎంలను ఏర్పాటు చేయడంలో జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బంది చూపించిన ఉత్సాహం, వాటి నిర్వహణలో లేకపోవడంతో ప్రజాధనం వృధా అవుతోంది. ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని సరస్వతీనగర్ రహదారిపై కొన్నేళ్ల క్రితం వాటర్ ఏటీఎంను ఏర్పాటు చేశారు. మొదట్లో పాదచారులు, వాహనదారులకు ఎండాకాలంలో వాటర్ ఏటీఎంలు చల్లటినీటిని అందించి సేదతీర్చేవి. తదానంతరం కొంత కాలానికే నిరుపయోగంగా మారడంతో పాదచారులు ఎండాకాలంలో దాహార్తిని తీర్చుకునేందుకు దుకాణాల బాట పట్టాల్సి వస్తుందని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించి మరమ్మతులు చేయిస్తే వేసవిలో దాహార్తిని తీర్చడానికి వీలుంటుందని ప్రజలు కోరుతున్నారు.

పేకాడుతున్న వ్యక్తుల అరెస్ట్

సైదాబాద్: సైదాబాద్ డివిజన్ పూసలబస్తీలో పేకాడుతున్న ఇంటిపై పోలీసులు దాడి చేసి నిర్వాహకుడు సహా ఐదుగురిని అరెస్ట్ చేశారు. వారి నుంచి నగదు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పూసలబస్తీలో నివసించే రాజేష్ (32) డబ్బు సంపాదన కోసం తన ఇంట్లోనే జూదం నిర్వహిస్తున్నాడని పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఆదివారం రాత్రి సదరు ఇంటిపై దాడులు నిర్వహించి రాజేష్ సహా ఐదుగురు పేకాడుతూ పట్టుబడ్డారు. తన్వీర్ నర్సింగ్, కొత్తోజు శ్రీశైలం, గుండ్ల జగదీష్‌బాబు, శివకుమార్‌రెడ్డిలను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రూ.21500 నగదు, ఐదు సెల్‌ఫోన్లు, ప్లేయింగ్ కార్డ్స్‌ను స్వాధీనం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.